రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సెహరి
	సోమవారం	మంగళవారం
కర్నూలు	6:35	4:57
నంద్యాల	6:31	4:57



పేరుకే నిషేధం...!

గుట్కా విక్రయాలపై నిషేధం విధించినా వాటి విక్రయాలు మాత్రం జోరుగా సాగుతున్నాయి. ముఖ్యంగా టీ స్టాళ్లు, చిల్లర దుకాణాలు, బంకుల్లో యథేచ్ఛగా విక్రయాలు జరుగుతున్నా పట్టించుకునే నాథుడే లేడు. వాహన డ్రైవర్లు, యువకులు, కొందరు విద్యార్థులు, కార్మికులు సైతం గుట్కా మత్తులో పడి అనారోగ్యానికి గురవుతున్నారు. అరికట్టాల్సిన అధికారులు ఏళ్ల తరబడి దాడులు చేసిన దాఖలాలే జిల్లాలో కనిపించడం లేదు. దీంతో యథేచ్ఛగా గుట్కా వ్యాపారాలు జోరందుకొని ఆయా వ్యాపారులకు కాసుల వర్షం కురిపిస్తుంటే వాటికి బానిసైన వారు మాత్రం అనారోగ్యం బారిన పడుతున్నారు.

- యథేచ్ఛగా గుట్కా విక్రయాలు
- ఇతర ప్రాంతాల నుంచి సరఫరా
- జిల్లాలో నెలకు రూ.కోట్లలో వ్యాపారం
- మామూళ్ల మత్తులో అధికారులు
- ఏళ్ల తరబడి తనిఖీలు మరిచిన వైనం


నంద్యాల, మార్చి23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గుట్కా వ్యాపారం జోరుగా సాగుతోంది. పల్లె పట్టణం అనే తేడా లేకుండా ఎక్కడ పడితే అక్కడ విచ్చలవిడిగా గుట్కా విక్రయాలు సాగుతున్నాయి. కర్ణాటక, తమిళనాడు, గుంతకల్లు తదితర ప్రాంతాల నుంచి నిషేధిత గుట్కా ప్యాకెట్‌లు పెద్దమొత్తంలో జిల్లాకు తీసుకు వచ్చి వ్యాపారం సాగిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మత్తుకు బానిసైన యువకులు, కార్మికులు, కొందరు విద్యార్థులు సైతం వీటిని కొనుగోలు చేసి అనారోగ్యం బారిన పడుతున్నారు. తద్వారా మత్తుకు అలవాటుపడి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. కొందరు వివిధ రకాల క్యాన్సర్‌ల బారిన పడుతుంటే మరికొందరు దీర్ఘకాలిక జబ్బులకు గురవుతున్నారు. ఇంతలా గుట్కా మహమ్మారి అనారోగ్యాన్ని వెంటాడుతుండటంతోపాటు ప్రాణాలు తీస్తున్నా మత్తుదారుల్లో ఏమాత్రం మార్పు రావడం లేదు. నియంత్రించాల్సిన అధికారులు సైతం మామూళ్ల మత్తులో పడి ఆ వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. దీంతో జిల్లా వ్యాప్తంగా గుట్కా వ్యాపారం జోరందుకుంటోంది. ఇదిలా ఉండగా స్థానిక పోలీసులకు మాత్రం నెలవారీ మామూళ్ల రూపంలో కాసుల వర్షం కురిపిస్తోందని ఆ వర్గాల నుంచి తెలిసింది.

మాముళ్లలో ఆ మూడు శాఖలు..

గుట్కా అమ్మకాలపై పంజా విసరాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో మునిగి తేలుతున్నారు. నిషేధిత గుట్కా అమ్మకాలు నియంత్రించాల్సిన ఆహార కల్తీ నిరోధక శాఖ, వాణిజ్య పన్నుల శాఖలు, స్థానిక పోలీసు అధికారులు సైతం గాలికి వదిలేశారు. దీంతో ఆయా ప్రాంతాల్లో విచ్చలవిడిగా గుట్కా దందా సాగుతోంది. ఆహార కల్తీ నిరోధక శాఖ, పోలీసు శాఖల అధికారులు గుట్కా వ్యాపారులపై చర్యలు తీసుకున్న దాఖలు కనిపించడం లేదు. జిల్లాలో గుట్కా ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో సమాచారం తెలిసినా పోలీసు అధికారులు, సిబ్బంది వాటిపై కన్నెత్తి కూడా చూడటం లేదని సమాచారం. ఆహార కల్తీ నిరోధక శాఖ, వాణిజ్య పన్నుల శాఖ అధికారలదీ ఇదే దుస్థితి. దీనికి ప్రధానంగా గుట్కా వ్యాపారుల నుంచి నెలవారీ మామూళ్లు తీసుకొని ఆయా శాఖలు మిన్నుకుండిపోతున్నాయనే విమర్శలు జిల్లాలో లేకపోలేదు.

కనిపించని కమిటీ...

నిషేధిత గుట్కా వ్యాపారుల ఆటకట్టించాల్సిన కమిటీ జిల్లాలో ఎక్కడా కనిపించడం లేదు. కనీసం అందరూ కలిసి దాడులు చేసిన దాఖలాలు కనిపించడం లేదు. పేరుకే కమిటీలుగా మిగిలిపోయాయి. ప్రభుత్వం గుట్కాలాంటి మత్తు పదార్థాలను నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతోపాటు నిషేధాన్ని అమలు చేసేందుకు ఓ కమిటీని కూడా నియమించింది. వైద్య ఆరోగ్యశాఖ, వాణిజ్య పన్నుల శాఖ, విజిలెన్సు ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీసు, పంచాయతీ రాజ్, రవాణా, ఆహార కల్తీ నిరోధక శాఖల అధికారులు సమన్వయంతో దాడులు చేయాల్సి ఉంది. కానీ సదరు కమిటీ ఎక్కడా ఆచరణలో ఉన్నట్లు జిల్లాలో కనిపించడం లేదు. కనీసం కమిటీ ఉందో లేదో కూడా అర్థం కానీ దుస్థితి. తద్వారా జిల్లాలో ఎక్కడికక్కడ జోరుగా గుట్కా వ్యాపారం విచ్చలవిడిగా బహిరంగంగానే సాగుతోంది.



నిషేధం ఉన్నా.. తగ్గని జోరు...

జిల్లాలో గుట్కా విక్రయాలపై నిషేధం ఉన్నప్పటికీ ఎక్కడా అమలు కావడం లేదు. సంబంధిత అధికారులు నామమాత్రపు తనిఖీలతో మమ అనిపిస్తున్నారనే విమర్శలు లేకపోలేదు. గుట్కా విక్రయాలపై అధిక శాతం ఆదాయం ఉండటంతో నిషేధించారని తెలిసినప్పటికీ కొందరు వ్యాపారులు గుట్టుగా అమ్మకాలు చేసి సొమ్ము చేసుకుంటున్నారు. వీటికి మార్కెట్‌లో ఎక్కువ డిమాండ్ ఉండటం మరింత కలిసి వస్తోంది. అధికారులకు మామూళ్లు సమర్పించి ఇష్టారాజ్యంగా సొమ్ము చేసుకుంటున్నారు. టీ స్టాళ్లు, కేఫ్‌లు, వివిధ దుకాణాల్లో విచ్చలవిడిగా వేలాడదీసి బహిరంగంగానే అమ్మకాలు చేస్తుండటం పలు విమర్శలకు తావిస్తోంది. జిల్లా కేంద్రంలోనే కొందరు బడా వ్యాపారులు ఉన్నట్లు తెలుస్తోంది. వీరితోపాటు డోన్, బనగానపల్లె, బేతంచెర్ల, ఆత్మకూరు, ఆళ్లగడ్డ, కొలిమిగుండ్ల తదితర ప్రాంతాల్లో కూడా వ్యాపారులు ఉన్నట్లు సమాచారం. వీరందరూ కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాల నుంచి గుట్కా ప్యాకెట్‌లు తీసుకువచ్చి వ్యాపారాలు సాగిస్తున్నారు.



నెలలో రూ.కోట్లలో వ్యాపారం..

జిల్లా వ్యాప్తంగా నెలకు గుట్కా వ్యాపారం రూ.కోట్లలో సాగుతున్నాయి. దీంతో ఎక్కడ చూసినా నిషేధిత గుట్కాలు లభ్యమవుతున్నాయి. పలువురు యువత, విద్యార్థులు, కార్మికులు వీటిని సేవించి అనారోగ్యానికి గురవుతున్నారు. వివిధ వ్యాపార కూడళ్లు, కిళ్లీ దుకాణాలు, చిన్నచిన్న హోటళ్లు, కిరాణ దుకాణాల్లో నిత్యం గుట్కాలు అందుబాటులో ఉంటున్నాయి. దీంతో గుట్కా ప్రియులు వీటిని రూ. 15 నుంచి రూ.30 వరకు వెచ్చించి మరీ కొనుగోలు చేస్తున్నారు. డ్రైవర్లు ఎక్కువగా వీటిని సేవిస్తుండటం గమనార్హం. వీటిని కట్టడి చేయాల్సిన ఆయా శాఖ అధికారులు ఆ వైపు కన్నెత్తి కూడా చూడకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది.

గుట్కా విక్రయాలపై ప్రత్యేక నిఘా ఉంచుతాం



జిల్లాలో నిషేధిత గుట్కా విక్రయాలపై ప్రత్యేక నిఘా ఉంచుతాం. వాటిని సేవించి అనారోగ్యం బారిన పడకుండా అవగాహన కల్పిస్తాం. గతంలో ఎక్కువగా ఉందని తెలిసింది. స్పెషల్ డ్రైవ్ పెట్టి మరీ గుట్కా వ్యాపారులపై నిఘా ఉంచి గుట్కా విక్రయాలు జరగకుండా చూస్తాం.

- ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

నంద్యాల నూనెపల్లె, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ హాల్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నుంచి వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమానికి వచ్చే ప్రజలు ఎవరూ ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో సోమవారం ఉదయం 9:30 గంటలకు ప్రారంభించి మధ్యాహ్నం 12:30 గంటలకు పూర్తి చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా పీజీఆర్‌ఎస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆమె చెప్పారు.

జిల్లా వ్యాప్తంగా కార్డెన్ సెర్చ్



పోలీసులు స్వాధీనం చేసుకున్న మోటార్‌సైకిళ్లు

నంద్యాల క్రైం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు ఆదివారం కార్డెన్ సెర్చ్ నిర్వహించినట్లు పోలీస్ అధికారులు తెలిపారు. జిల్లాలోని అన్ని సబ్ డివిజన్లతోపాటు నంద్యాల టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో కూడా కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. పోలీస్ స్టేషన్ల క్యూఆర్టీ టీం సిబ్బంది, స్థానిక పోలీసులు బృందాలుగా ఏర్పడి కార్డెన్‌సెర్చ్ ఆపరేషన్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్డెన్‌సెర్చ్‌లో భాగంగా అనుమానితులు, రౌడీషీటర్ల ఇళ్లలో తనిఖీలు నిర్వహించారు. సరైన ధృవపత్రాల్లేని 51మోటార్‌సైకిళ్లు, 6 ఆటోలు, 9 క్వార్టర్‌బాటిళ్లు, 10 లీటర్ల నాటుసారాను సీజ్‌చేసినట్లు తెలిపారు. రౌడీషీటర్లకు కౌన్సెలింగ్: ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు ఆదివారం జిల్లా వ్యాప్తంగా రౌడీషీటర్లకు పోలీస్ అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించారు.

అకాల వర్షంతో పంట నష్టం



గాలి వానకు నేల కొరిగిన వరి పంట

గోస్పాడు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం రాత్రి కురిసిన అకాల వర్షంతో పలు పంటలు దెబ్బతిన్నాయి. మండలంలో సాగులో ఉన్న వరి, మొక్కజొన్న, మిరప. వేరుశెనగ పంటలు దెబ్బతిన్నాయి. 1890 హెక్టార్లలో వరి పంట సాగులో ఉండగా యాళూరు, శ్రీనివాసపురం, నెహ్రూనగర్, జిల్లెళ్ల, దీబగుంట్ల, కానాలపల్లె గ్రామాలలో వరి నేలకొరిగింది. మొక్కజొన్న 125 హెక్టార్లలో సాగులో ఉండగా కొన్నిచోట్ల దెబ్బతినింది. మిరప 440 హెక్టార్లలో సాగులో ఉండగా గాలి వానకు మిరపకాయలు రాలి రైతులు నష్ట పోయారు.

ప్రాథమిక పంట నష్ట నివేదిక సమర్పిస్తాం : స్వప్నిక, ఏవో

శనివారం రాత్రి కురిసిన వడ గండ్ల వాన వల్ల పంట నష్టం జరిగినట్లు తెలిపారు. సోమవారం పంటనష్టం జరిగిన గ్రామాలలో పంట పొలాలను సందర్శించి ప్రాథమిక పంటనష్ట నివేదిక ఉన్నతా . దికారులకు సమర్పిస్తానని తెలిపారు.

ప్రజా సమస్యలన్నీ పరిష్కరిస్తాం

మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి



ప్రజలనుంచి అర్జీలను స్వీకరిస్తున్న మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి

బనగానపల్లె, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలన్నీ ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. యుద్ధప్రాతికదిన సమస్యలను పరిష్కరించి ప్రజలకు న్యాయం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఆదివారం బనగానపల్లె పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో గ్రీవెన్స్ సెల్ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. జిల్లాలోని నలుమూలలనుంచి వచ్చిన ప్రజలనుంచి వచ్చిన విజ్ఞప్తులను మంత్రి స్వయంగా స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ వర్గాల ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలు అభిమానులు తరలివచ్చి తమ సమస్యలను మంత్రికి వివరించారు. న్యాయబద్ధంగా ఉన్న సమస్యలను అక్కడికక్కడే ఫోన్‌లో మాట్లాడి పరిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సమస్యలతో వచ్చే వారిపట్ల అధికారులు సానుకూలంగా స్పందించాలని సూచించారు. సమస్యలను పరిష్కరించడంలో అధికారులు శ్రద్ధ చూపాలని కోరారు.



కట్టెల సహాయంతో నడుచుకుంటూ వస్తున్న భక్తుడు



దారులన్నీ మల్లన్న వైపే..

ఉగాది ఉత్సవాలకు శ్రీశైలానికి తరలుతున్న కన్నడిగులు

శ్రీశైలం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో ఈ నెల 27 నుంచి 31వ తేదీ వరకు జరిగే ఉగాది ఉత్సవాలకు కర్ణాటక రాష్ట్రం నుంచి భక్తులు నిత్యం వేలాదిగా తరలివస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు పాదయాత్రగా వస్తూ తమ భక్తి ప్రపత్తులను చాటుకుంటున్నారు. వందల కిలోమీటర్ల దూరం నుంచి ప్రతి ఏటా ఉగాది రోజున శ్రీశైలానికి చేరుకుని భ్రమరాంబ మల్లికార్జున స్వామివారిని కర్ణాటక భక్తులు దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఆత్మకూరు నుంచి వెంకటాపురం, నాగలూటి, పెద్దచెరువు, భీముని కొలను, కైలా ద్వారం మీదుగా శ్రీశైలానికి దుర్భేధ్యమైన అడవులను సైతం లెక్కచేయకుండా వస్తున్నారు. శ్రీశైలానికి వస్తున్న కన్నడ భక్తులకు దేవస్థానం భీముని కొలను, కైలా ద్వారం వద్ద తాగునీరు, అల్పాహారం, వైద్యసదుపాయాలు కల్పిస్తోంది. వేల సంఖ్యలో భక్తులు తరలివస్తుండటంతో క్షేత్ర వీధులన్నీ రద్దీగా దర్శనమిస్తున్నాయి. కర్ణాటకతో పాటు మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు తరలివస్తున్నారు.



8 నెలల తర్వాత...

సంగమేశ్వరంలో స్వామివారికి పూజలు

కొత్తపల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): జలాధివాసం వీడిన సప్తనదుల సంగమేశ్వర ఆలయంలో పూజలు ప్రారంభమయ్యాయి. 8 నెలలుగా నదీజలాల్లో నిక్షిప్తమైన సంగమేశ్వరుడు జలాల నుంచి పూర్తి స్థాయి నుంచి బయటపడ్డారు. ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామశర్మ రెండు రోజులుగా భక్తుల సహకారంతో బురదతో ఉన్న ఆలయాన్ని శుభ్రం చేయించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి వేపదారు శివలింగాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉంటే తెలంగాణ ప్రాంతం నుంచి సోమశిల మీదుగా భక్తులు అధిక సంఖ్యలో మరబోట్ల ద్వారా తరలి వస్తున్నారు. 8 నెలల తర్వాత ఆలయం బయట పడటంతో భక్తుల సంఖ్య రాబోయే రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉంది.



సంగమేశ్వర స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

చిన్న పిల్లలకు అత్యాధునిక వైద్యం

వైద్య సదస్సుకు హాజరైన 140 మంది డాక్టర్లు



రాయలసీమ వైద్య విజ్ఞాన సదస్సులో పాల్గొన్న చిన్న పిల్లల వైద్యులు

కర్నూలు హాస్పిటల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): చిన్న పిల్లల్లో ఒక్కోసారి అత్యవసర పరిస్థితులు ఏర్పడుతాయని, వాటిని సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే అత్యాధునిక చికిత్సలు చేయాల్సి వస్తుందని చిన్న పిల్లల వైద్య నిపుణులు తెలిపారు. ఆదివారం ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ పీడియాట్రిషియన్ కర్నూలు కిమ్స్ ఆధ్వర్యంలో వైద్య విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సదస్సుకు రాయలసీమ ప్రాంతానికి చెందిన 140 మంది వైద్యులు హాజరయ్యారు. ఎక్స్‌ట్రా, కార్పొరియల్, థెరపీ, ఎక్మో, సీఆర్ఆర్‌టీ లాంటి పలు రకాల చికిత్సలను కర్నూలు కిమ్స్ వైద్యులు, చిన్న పిల్లల వైద్యులు వివరించారు. ఎక్మో అందించడంతోపాటు అందులో వస్తున్న అత్యాధునిక పరికరాలు కూడా అక్కడకు తీసుకువచ్చి వాటిపై ఎలా పని చేయాలో ఏపీఎంసీ కాన్ఫరెన్స్ పరిశీలకులు డా.జి. సుధాకర్, పీడియాట్రిక్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శి డా. విజయానందబాబు, డా. వీర రత్నాకర్ రెడ్డి తెలిపారు.

రైతుబజారులో వ్యాపారుల బండారం బట్టబయలు

తూనికలు, కొలతల శాఖ అధికారుల తనిఖీలో వెల్లడైన మోసాలు



తూనికలు, కొలతల శాఖ అధికారుల ఆకస్మిక తనిఖీ

కర్నూలు అగ్రికల్చర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే వినియోగదారులకు తక్కువ ధరకే నాణ్యమైన కూరగాయలు అందిస్తున్న రైతుబజారుగా సీ క్యాంపు రైతుబజారుకు ఇప్పటి దాకా మంచి పేరు వచ్చింది. అయితే తెర వెనుక ఈ రైతుబజారులో కూరగాయల వ్యాపారులు వినియోగదారులు ఎంతగా మోసం చేస్తున్నారో ఆదివారం తూనికలు, కొలతల శాఖ అధికారుల తనిఖీల్లో బట్టబయలైంది. తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ విజయకుమార్‌తో పాటు ఎస్టేట్ అధికారి కళ్యాణమ్మ, హార్టికల్చర్ అసిస్టెంట్ శివకుమార్ తదితరులు ఆకస్మికంగా కూరగాయలు అమ్ముకుంటున్న వ్యాపారులను తనిఖీ చేశారు. వారి కాటాలను క్షుణ్ణంగా పరిశీలించారు. దాదాపు 20 మంది వ్యాపారులు తూకం రాళ్ల సక్రమంగా లేవని, కొత్తవి వాడడం లేదని నిగ్గు తేల్చారు. అదేవిధంగా మరో ఐదుగురు వ్యాపారుల కాటాలు తప్పుగా ఉన్నట్లు తనిఖీలో బయట పడింది. వారికి నోటీసులు అందించి, మరోసారి ఇలా జరిగితే బయటకు పంపుతామని ఎస్టేట్ అధికారి కళ్యాణమ్మ వారికి హెచ్చరికలు జారీ చేశారు.

పని భారమంతా కింది సిబ్బందిపైనే..

- ఉన్నతాధికారులు నామమాత్రంగానే సేవలందిస్తున్నారు
- రాష్ట్ర ఫెడరేషన్ చైర్మన్ సేవా నాయక్ ధ్వజం



కొత్తగా ఎన్నికైన కార్యవర్గంతో రాష్ట్ర ఫెడరేషన్ చైర్మన్ సేవా నాయక్

కర్నూలు అగ్రికల్చర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధక శాఖలో పని భారమంతా కింది స్థాయి సిబ్బంది మీదే పడుతోందని, ఈ విషయం ప్రభుత్వం గుర్తించాలని ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్ బి. సేవా నాయక్ అన్నారు. ఆదివారం నగరంలోని వెటర్నరీ పాలిక్లినిక్ ప్రాంగణంలో ఏపీ నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నేరియన్స్ ఫెడరేషన్ ఉమ్మడి కర్నూలు జిల్లా ఉద్యోగుల సర్వసభ్య సమావేశం ఫెడరేషన్ జిల్లా చైర్మన్ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్షేత్రస్థాయిలో మూగ జీవాలకు వైద్యసేవలు అందించేందుకు చేపట్టిన పథకాల్లో గ్రామస్థాయి సిబ్బంది ముఖ్యపాత్ర పోషిస్తున్నారని అన్నారు. ఈ విషయంలో అధికారులు నామమాత్రంగా పని చేస్తూ అంతా తామే చేస్తున్నట్లు తప్పుడు లెక్కలు రికార్డుల్లో చూపుతున్నారని అన్నారు. సమావేశంలో పశు సంవర్ధక శాఖలోని మూడు సంఘాలు వెటర్నరీ అసిస్టెంట్ సర్వీసు అసోసియేషన్, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్, వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్స్ అసోసియేషన్ కార్యవర్గ పదవీ కాలం పూర్తయినందున ఈ సంఘాలకు కొత్తగా కార్యవర్గాలను ఎన్నుకున్నారు.

హోరాహోరీగా

ఎక్సైజ్ కానిస్టేబుల్స్ అసోసియేషన్ ఎన్నికలు

జిల్లా అధ్యక్షుడిగా వైవీ గిరిబాబు

కర్నూలు అర్బన్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ కానిస్టేబుల్స్ అండ్ హెడ్ కానిస్టేబుళ్ల అసోసియేషన్ ఎన్నికలు ఆదివారం హోరాహోరీగా సాగాయి. నగరంలోని జిల్లా అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన ఎన్నికల్లో ఎన్నికల అధికారిగా సీఐ రాజేంద్రప్రసాద్, అబ్జర్వర్‌గా అసిస్టెంట్ సూపరిటెండెంట్ రాజేశఖర్‌గౌడ్ పర్యవేక్షణలో ఇరు వర్గాలకు చెందిన ఉద్యోగులు ఓటింగ్‌లో పాల్గొని ఓట్లు వేశారు. జిల్లా వ్యాప్తంగా 209 మంది ఉద్యోగులు ఉండగా 207 మంది హాజరై నూతన అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. గత దశాబ్ద కాలంగా జిల్లా అధ్యక్షుడి కొనసాగుతున్న ఓబిలేస్‌ను ఈ సారి ఉద్యోగులు ఓడించారు. నూతన అధ్యక్షుడిగా కానిస్టేబుల్ వైవీ గిరి బాబు కు 146 ఓట్లు వేసి గెలిపించారు. ఓబిలేష్‌కు కేవలం 60 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. వైవీ గిరిబాబుకు చెందిన ప్యానల్ మొత్తం సభ్యులు ఎన్నికవ్వడంతో ఉద్యోగులు సంబరాలు చేసుకున్నారు. జనరల్ సెక్రటరీలుగా పి.విజయకుమార్, పి.విరుపాక్షిరెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా అబ్దుల్ మాలిక్, ట్రెజరర్‌గా కల్పనను ఎన్నుకున్నారు.

శ్రీశైల జలాశయం సందర్శన



డ్యామ్‌ను సందర్శిస్తున్న ఖజానా శాఖ డైరెక్టర్ మోహన్‌రావు

సున్నిపెంట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): శ్రీశైల జలాశయాన్ని ఆదివారం ఖజానా శాఖ డైరెక్టర్ మోహన్‌రావు సందర్శించారు. మొదట సున్నిపెంటలోని సబ్ ట్రెజరీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. అనంతరం శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లను దర్శించుకున్నారు. ఆయన వెంట జిల్లా ట్రెజరీ ఆఫీసర్ రామచంద్రారావు, రమణ, రసూల్, ప్రకాష్, లక్ష్మయ్య, వెంకటేశ్వర్లు ఉన్నారు.

క్షయ నివారణ సాధ్యమే

- ముందుగా గుర్తించి వైద్యం చేయించుకుంటే తగ్గుతుంది
- జిల్లా వ్యాప్తంగా 2024లో 3077 కేసుల నిర్ధారణ
- నేడు ప్రపంచ క్షయ నివారణ దినం



కర్నూలు హాస్పిటల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): క్షయ ఒకప్పుడు ప్రమాదకర వ్యాధి. ఇప్పుడు అంత భయపడాల్సిన పని లేదు. సమర్థవంతమైన చికిత్స అందుబాటులో ఉంది. అయినా క్షయ పూర్తిగా నివారణ కావడం లేదు. ప్రపంచ ప్రజలను భయపెడుతున్న ప్రాణాంతక 10 వ్యాధుల్లో టీబీ ఒకటి. ప్రతి పది మందిలో నలుగురు టీబీ బారిన పడుతున్నారు. ఇది అంటువ్యాధి. ట్యూబర్ క్యూలోసిస్ అనే బ్యాక్టీరియా వల్ల వస్తుంది. ప్రతి ఏటా ప్రపంచ టీబీ నివారణ దినాన్ని డబ్ల్యూహెచ్‌వో నిర్వహిస్తోంది.

క్షయ రోగ నిర్ధారణ పరీక్షల్లో ఎక్స్‌రే ప్రధానం. స్పుటం టెస్టు కూడా చేస్తారు. జిల్లా వ్యాప్తంగా 29 ట్రూనాట్ యంత్రాల ద్వారా రోగ నిర్ధారణ పరీక్షలు చేస్తారు. వీటితో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కర్నూలు, నంద్యాల, ఆదోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మైక్రో బయాలజీకి చెందిన సీబీనాట్ యంత్రాలు అందుబాటులో ఉన్నాయి. ఇప్పుడు కొత్తగా నోట్ బుక్ తరహాలో ఉండే హ్యాండ్ ఎల్డ్ ఎక్స్‌రే మిషన్ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సహకారంతో సేవలు అందుబాటులోకి రానున్నాయి.

లక్షణాలు

క్షయ వ్యాధిని కొన్ని లక్షణాల ద్వారా గుర్తించవచ్చు. కనీసం 3 వారాలపాటు తీవ్రమైన దగ్గు, దగ్గినప్పుడు కఫం రావడం ప్రధాన లక్షణం. టీబీ వచ్చిన వారిలో విపరీతమైన దగ్గు, ఛాతిలో నొప్పి, తలనొప్పి, నీరసం, జ్వరం, అలసట, ఆకలి తగ్గడం, బరువు తగ్గడం, చలివేయడం లక్షణాలు కనిపిస్తాయి.

జిల్లా పరిస్థితి..

జిల్లాలో చాపకింద నీరులా క్షయ విస్తరిస్తుంది. 2020లో జిల్లా జనాభా 22.92 లక్షలకు గాను 28,923 మంది టీబీ పరీక్షలు నిర్వహించగా.. 1974 కేసులు వెలుగు చూశాయి. 2024లో 24.54 లక్షల జనాభాకు 78,368 టెస్టులు చేయగా.. 3077 కేసులు వచ్చాయి. టెస్టుల సంఖ్య జనాభా సంఖ్య పెరిగిన నేపథ్యంలో టీబీ కేసులు చాపకింద నీరులా విస్తరిస్తున్నాయి.



సేవాభారతి మొబైల్ వాహనం ద్వారా సేవలు

క్షయ వ్యాధులను గుర్తించేందుకు అశ్విని హాస్పిటల్ అధినేత పల్మనాలిస్టు డా. శ్రీనివాసరెడ్డి జిల్లాలో సేవాభారతి మొబైల్ డయోగ్నస్టిక్ వాహనం ఏర్పాటు చేశారు. ప్రతిరోజు జిల్లాలో హైరిస్క్ టీబీ కేసులు ఉన్న ప్రాంతాలకు ఈ మొబైల్ వాహనం వెళ్లి అక్కడ రోగులకు ఎక్స్ రే తీసి కేసులు నిర్ధారణ అయితే రెఫరల్ కేంద్రాలకు పంపిస్తుంటారు.

క్షయ వ్యాధిగ్రస్తులకు ఆర్థిక సాయం

క్షయ వ్యాధిగ్రస్తులకు చికిత్స సమయంలో నెలకు రూ.1000 పోషకాహారం కోసం కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుంది. ఇటీవలె రూ.500 ఉన్న ఈ సహాయాన్ని రూ.1000లకు పెంచింది. ప్రజల్లో క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించిన సిబ్బందికి రూ.500, మందులు మింగించిన పర్యవేక్షకులకు రూ.1000/రూ.1,500 పారితోషకాన్ని అందిస్తుంది. క్షయ వ్యాధి ఉన్న వారు 6 నెలలకు సరిపడే ఖరీదైన మందులు ఉచితంగా 6 నెలల వరకు ఇస్తుంది.

క్షయ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ప్రజలు క్షయ వ్యాధిపట్ల అప్రమత్తంగా ఉండాలి.. ప్రారంభ దశలోనే గుర్తిస్తే నివారణ సాధ్యమే. రాష్ట్రంలో క్షయ వ్యాధిని నిర్ధారించే పరీక్షలో కర్నూలులో మొదటి స్థానంలో ఉంది. వరల్డ్ టీబీ డే సందర్భంగా సోమవారం ర్యాలీ, సదస్సును ఏర్పాటు చేస్తున్నాం.

– డాక్టర్ ఎల్.భాస్కర్, డిస్ట్రిక్ట్ లెప్రసీ, ఎయిడ్ అండ్ టీబీ కంట్రోల్ ఆఫీసర్, కర్నూలు

టీబీ అంటు వ్యాధి



క్షయ అంటు వ్యాధి. ఇది దగ్గు ద్వారా ఇతరులకు వేగంగా వ్యాపిస్తుంది. ఇంట్లో టీబీతో బాధపడే వారికి మిగిలిన కుటుంబ సభ్యులు కొంత దూరంగా ఉండాలి. షుగర్, కిడ్నీ, హెచ్ఐవీ, వ్యాధులున్న వారికి టీబీ వ్యాధి వచ్చే అవకాశం ఉంటుంది.

– డాక్టర్ కమ్మర వినోద్ ఆచారి, కన్సల్టెంట్ ఫల్మనాలజిస్టు, కర్నూలు మెడికవర్ హాస్పిటల్

మంత్రాలయంలో న్యాయసుధ మంగళ ఉత్సవం



బంగారు పల్లకి ఊరేగింపులో పాల్గొన్న పీఠాధిపతులు

పాల్గొన్న 13 మంది పీఠాధిపతులు



పాల్గొన్న వివిధ రాష్ట్రాల పండితులు

మంత్రాలయం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి సన్నిధానంలో శ్రీమన్ న్యాయసుధ మంగళ ఉత్సవం ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. రెండు రోజులు పాటు మంత్రాలయం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో జరిగే ఈ వేడుకలో వివిధ మఠాలకు చెందిన 12 మంది పీఠాధిపతులు హాజరయ్యారు. వేదవ్యాసపూజ, బంగారు పల్లకి ఊరేగింపులో పాల్గొని ఇష్టాగోష్టి నిర్వహించారు. తొలిరోజు శ్రీమఠం ప్రాంగణం, ఊంజల మండపంలో 13 మంది పీఠాధిపతులు బంగారు సింహాసనంపై మధ్వాచార్యులు, శ్రీరాముల విగ్రహ ప్రతిమలు, గ్రంథాలను ఉంచి పూజలు చేశారు. అనంతరం రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి మఠాధిపతులు పూజలు చేసి హారతులు ఇచ్చారు. గురుసార్వభౌమ సంస్కృత విద్యాపీఠం పండితుల ఆధ్వర్యంలో ఇష్టాగోష్టి నిర్వహించారు. 12 ఏళ్లుగా చదివిన సంస్కృత న్యాయ సుధ గ్రంథాలను బోధించిన పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు, పండిత కేసరి విద్వాన్ రాజా ఎస్‌గిరిరాజాచార్‌లు శ్రమించి బోధించడంపై పలువురు పీఠాధిపతులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ వేడుకలో పీఠాధిపతులు విద్యాశ్రీశ తీర్థులు, సుజయనిధితీర్థులు, విద్యాసాగరతీర్థులు, విద్యావల్లభతీర్థులు, వేదవర్ధనతీర్థులు, ఈశప్రియతీర్థులు, విద్యేశతీర్థులు, అక్షోభ్యరామప్రియతీర్థులు, విద్యేంద్రతీర్థులు, బన్నాంజే రాఘవేంద్రతీర్థులు, ఉడిపి వామనతీర్థులు పాల్గొన్నారు. వీరికి పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో బండాచార్, ఎస్ఎన్ వెంకటేశాచార్, గయా రామాచార్, ఆనందతీర్థాచార్, గౌతమాచార్, సుజీంద్రాచార్, వాదిరాజాచార్, ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు వెంకటేశ్ జోషి, శ్రీపతాచార్, సురేష్ కోనాపూర్, ఐపీ నరసింహమూర్తి, అనంత పురాణిక్, డీఎం ఆనందరావు, ద్వారపాలక అనంతస్వామి, ప్రకాషాచార్ తదితరులు పాల్గొన్నారు.

నేటితరం కళాకారులకు

స్ఫూర్తి ప్రదాత 'వెల్దుర్తి'



కళాకారులను సత్కరిస్తున్న పత్తి ఓబులయ్య తదితరులు

కర్నూలు కల్చరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): నేటితరం రంగస్థల నటులకు స్ఫూర్తిప్రదాతగా జిల్లాకు చెందిన వెల్దుర్తి వెంకట నరసా నాయుడు నిలిచిపోతారని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య కొనియాడారు. ఆదివారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో దివంగత సీనియర్ కళాకారుడు వెల్దుర్తి వెంకట నరసా నాయుడు వర్ధంతిని నిర్వహించారు. వెల్దుర్తి చిత్ర పటానికి రంగస్థల నటులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పత్తి ఓబులయ్య మాట్లాడుతూ వెల్దుర్తి తన నటనతో, మధురమైన గాత్రంతో అలనాటి ఆంధ్ర శ్రోతలను ఉర్రూతలూరగించారన్నారు. ఆయన తర్వాత జిల్లాలో అటువంటి నటుడు లేరన్నారు. వెల్దుర్తి నటన, పద్యాలాపన అంశాలను నేర్చుకొని ఆధునిక పద్య గాయక నటులు రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వెల్దుర్తి వెంక ట నరసానాయుడు మనుమడు వెంకట నాయుడు, సీనియర్ నటు లు హెచ్ చంద్రన్న, పి.రాజారత్నం, జీవీ శ్రీనివాసరెడ్డి, బాలవెంకటేశ్వర్లు, వీవీ రమణారెడ్డి, పి.హనుమంతరావు చౌదరి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన రామాంజనేయ యుద్ధం : అనంతపురానికి చెందిన విద్యార్థిని ధూపం తిరుమల తేజ శ్రీరామునిగా, విజయనగరం జిల్లాకు చెందిన బొబ్బిలి నాయుడు ఆంజనేయుడిగా నటించిన రామాంజనేయయుద్ధం నాటక ప్రదర్శన ప్రేక్షకులను అలరింపజేసింది. తిరుమల తేజ, బొబ్బిలి నాయుడులను టీజీవీ కళాక్షేత్రం సభ్యులు శాలువాలు, పూలదండలతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. అదేవిధంగా కళాక్షేత్రం పక్షాన నగదుప్రోత్సాహకాన్ని అందజేశారు.

మిద్దెపై నుంచి పడి చిన్నారి మృతి

వందగల్లులో విషాదం



శ్రీదేవి (ఫైల్)

కోసిగి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని వందగల్లు గ్రామంలో లంక ఆంజనేయులు, నాగలక్ష్మి దంపతుల మొదటి కుమార్తె శ్రీదేవి(4) ఆదివారం ఆడుకుంటూ ఇంటి మిద్దెపై నుంచి కింద పడి మృతి చెందింది. వివరాలివీ.. శ్రీదేవి తల్లిదండ్రుతలతో పాటు ఆడుకుంది. అయితే పది నిమిషాల వ్యవధిలోనే ఇంటి మిద్దె ఎక్కిపై నుంచి కింద పడింది. తలకు తీవ్రగాయాలు కావడంతో రక్తమ డుగులో ఉన్న కూతురుని తల్లిదండ్రులు కోసిగి ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. ముందుగానే 108 సిబ్బందికి ఫోన్ చేయగా.. కోసిగి ఆసుపత్రి వద్దే ఉన్న 108 సిబ్బంది రామకృష్ణ బాలిక శ్రీదేవికి ప్రథమ చికిత్స అందించారు. అప్పటికే ప్రథమ చికిత్స అందించేలోపే శ్రీదేవి మృతి చెందిందని వైద్యులు, 108 సిబ్బంది తెలిపారు. అయ్యో.. చిట్టి తల్లి నాలుగేళ్లకే వందేళ్లు నిండిపోయాయా.. తమ కళ్ల ముందే ఇంతసేపు బుడి బుడి అడుగులు వేస్తూ గజ్జలసవ్వడితో.. చిరునవులతో తిరిగిన నీవు.. మమ్మల్ని వదిలి ఎలా వెళ్లిపోయావమ్మా అంటూ తల్లిదండ్రుల రోదనలు అక్కడున్న వారిని కంటతడి పెట్టించాయి. దంపతులకు 9 నెలల కూతురు కూడా ఉంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కొలిమిగుండ్ల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : తమిళనాడు నుండి కొలిమిగుండ్లకు 16 ఏళ్ల కింద వలస వచ్చి చిరు వ్యా పారం చేసుకుంటూ జీవిస్తున్న మురుగేషన్(49) ఆదివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో కొలిమిగుండ్ల శాంతినగర్‌లో విషాదం నెలకొంది. మురుగేషన్ వ్యాపారం కోసం ప్లాస్టిక్ సా మాన్లు కొనడానికి తాడిపత్రికి వెళ్లి, మోటార్‌సైకిల్‌పై తిరిగి కొలి మిగుండ్లకు వస్తుండగా వెంకట రెడ్డిపల్లె వద్ద ఎదురుగా నాప రాళ్ల ట్రాక్టర్ వచ్చి ఢీకొట్టింది. ట్రాక్టర్ తలపై నుండి వెళ్లడంతో తల నుజ్జునుజ్జుగా మారింది. దీంతో మురుగేషన్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయన బతుకుదెరువు కోసం వలస వచ్చి, ప్లాస్టిక్ సామాన్లు, మంచాలు, గృహోపకరణాలు పల్లెల్లో విక్రయించేవాడు. మృతదేహాన్ని తమిళనాడుకు తరలించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు సన్నిహితులు వెల్లడించారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



బావన్న(ఫైల్)

గోనెగండ్ల, మార్చి 23(ఆంధ్రజ్యోతి): గోనెగండ్ల మండల పరిధిలోని వేముగోడు గ్రామానికి చెందిన బావన్న(35) అనే యువకుడు విద్యుదా ఘాతంతో మృతి చెందాడు. శనివారం సాయంత్రం వేముగోడు గ్రామం లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో వర్షం కురిసింది. గ్రామంలోని బావన్న ఇంటికి విద్యుత్ సరఫరా చేసే సర్వీస్ వైర్ తెగి పోయి మెట్లపై పడింది. రాత్రి భోజనం చేశాక ఇంటి మిద్దెపై పడుకు నేందుకు మెట్ల మీద బావన్న వెళుతూ తెగినపడిన సర్వీస్‌వైర్ తొక్కాడు. విద్యుతాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ విజయభాస్కర్ తెలిపారు.

కృష్ణా నదిలో మునిగి

పదో తరగతి విద్యార్థి మృతి



కార్తీకేయ జస్వంత్ మృతదేహం

సున్నిపెంట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం డ్యాం దిగువ కృష్ణా నదిలో పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థి నీట మునిగి మృతి చెందింది. ఆదివారం సెలవు దినం కావడంతో సున్నిపెంటకు చెందిన నలుగురు విద్యార్థులు తెలంగాణ ప్రాంతానికి చెందిన లింగాలగట్టు ప్రాంతంలో ఈతకు వెళ్లారు. అందులో కార్తీకేయ జస్వంత్(17) అనే విద్యార్థి నీట మునిగి మృతి చెందాడు. సోమవారం పరీక్షకు వెళ్లాల్సిన విద్యార్థి మృతి చెందడం అందరినీ కలచివేసింది.

వంట గ్యాస్ పేలి ముగ్గురికి తీవ్ర గాయాలు

ఆలూరు రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : ఆలూరు మండల పరిధిలోని కురవల్లి గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున వంట గ్యాస్ సిలిండర్ పేలి ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. గ్రామంలో రైతులు తెల్లవారు జామున ట్రాక్టరులో పశుగ్రాసం తెచ్చేందుకు వెళుతుండగా వారికి వంట గ్యాస్ వాసన వచ్చింది. దీంతో ఇంట్లో నిద్రపోతున్న గాయత్రి, గురుస్వామి దంపతులను లేపి ఇంట్లో నుంచి గ్యాస్ వాసన వస్తోందని తెలిపారు. నిద్ర నుంచి లేచిన గురుస్వామి అగ్గిపుల్ల గీయడంతో ఒక్కసారిగా పెద్ద శబ్దం వచ్చింది. ఇద్దరు దంపతులతోపాటు ఎనిమిదేళ్ల కొడుకు ధర్మకు తీవ్ర గాయాలు కావడంతో ఆదోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వారి ఇంటి గోడల పైకప్పు కూలిపోయింది. క్షతగాత్రులను ఆలూరు టీడీపీ యువ నాయకుడు గిరి మల్లేష్ గౌడ్ పరామర్శించారు. బాధితులకు రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఉప్పర రవి, టీడీపీ నాయకులు ఈరప్ప, కేశన్న, మల్లయ్య, రామేష్ ఉన్నారు.

సంజన్న హత్య కేసులో

మరో నిందితురాలి అరెస్టు

కర్నూలు క్రైం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో శరీన్‌నగర్‌లో జరిగిన సంజన్న హత్య కేసులో మరో నిందితురాలు వడ్డె సావిత్రమ్మను పోలీసులు అరెస్టు చేశారు. ఇప్పటికే ఈ కేసులో అంజితో పాటు అతని కొడుకులు వీరి అనుచరుడు అశోక్‌ను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అంజి భార్య సావిత్రమ్మ కూడా ఈ హత్య కేసులో ప్రమేయం ఉన్నట్లు నిర్ధారణ కావడంతో అమెను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ మధుసూదన్‌గౌడు తెలిపారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

శివారు కాలనీల్లో సమస్యల తిష్ఠ

● కనీస సౌకర్యాలు లేక మారుతి నగర్, హాజీ నగర్ వాసుల అవస్థలు



మారుతి నగర్‌లో మురుగుతో నిండిపోయిన ప్రధాన కాలువ



కంకర వేసి వదిలేసిన దృశ్యం



హాజీ నగర్‌లో స్తంభాలకు దీపాలు ఏర్పాటు చేయని దృశ్యం

నందికొట్కూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు పట్టణ శివారు కాలనీల్లో ఏళ్ల తరబడి సమస్యలు తిష్ఠవేశాయి. రోడ్లు వేస్తామని చెప్పి గత కౌన్సిల్ ఎన్నికల ముందు రోడ్లు వేస్తామని చెప్పి ఓట్లు వేయించుకొని గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో రోడ్లు వేయకుండా తమను మోసం చేసిందని వాపోతున్నారు. సీసీ రోడ్డు మంజూరైనా రాజకీయ కారణాలతో రోడ్డు వేయలేదని మండిపడుతున్నారు. 2024 సాధారణ ఎన్నికల ముందు కాలనీల్లో రోడ్లు వేస్తున్నామని చెప్పి కంకర పరిచారే తప్పా ఇంత వరకు రోడ్లు వేయలేదన్నారు. పట్టణానికి శివారుగా ఉండడంతో మౌలిక సదుపాయాలు లేకపోవడంతో అక్కడక్కడ ఒక్కొక్క ఇల్లు నిర్మించుకున్నారు. ఖాళీగా ఉండడంతో ఇళ్ల సందుల్లో పిచ్చి మొక్కలు మొలిచాయి. విషపురుగులు సంచరిస్తుండడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. వర్షాకాలం పొలాల నుంచి వచ్చే వర్షపు నీటితో మారుతినగర్, హాజీ నగర్‌లో జలమయమవుతాయి. వర్షపు నీటిని తరలించేందుకు అప్రోచ్ కాలువలను పూర్తి స్థాయిలో నిర్మించకపోవడంతో ఈ సమస్యకు పరిష్కారం లభించడం లేదు. దీంతో వర్షపు నీరు రోడ్డుపై ప్రవహిస్తూ ఇళ్లలోకి చేరుతోంది. ఈ సమస్య సుదీర్ఘ కాలంగా ఉన్నా పరిష్కారానికి ప్రయత్నాలు చేయడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. హాజీ నగర్‌లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారే కాని ఇంత వరకు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయలేని కాలనీ వాసులు వాపోతున్నారు. హాజీనగర్, మారుతినగర్‌లలోని శివారు కాలనీల్లో రోడ్లు, తాగునీటి సౌకర్యం, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

వర్షాకాలంలో చాలా ఇబ్బందులు



వర్షాకాలంలో మారుతినగర్ ఎగువన కురిసే వర్షాలకు పంట పొలాల నుంచి వర్షపు నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. వర్షాకాలంలో నీటితో మారుతినగర్, హాజీ నగర్ రోడ్లు జలమయమవుతున్నాయి. మారుతి నగర్ నుంచి హాస్పిటల్ రోడ్డు వరకు డ్రైనేజీ కాలువను నిర్మించాలి.

- కరీముల్లా, మారుతి నగర్

రోడ్డు వేయలేదు



మా కాలనీలో రోడ్డు వేయకపోవడంతో ఇండ్ల నిర్మాణాలు మధ్యలో నిలిచి పోయాయి. అలాగే రోడ్డు వేయలేదు. వీధిలో ముళ్ల కంపలు విపరీతంగా పెరిగాయి. విష పురుగులు సంచరిస్తున్నారు. రాత్రిళ్లు ఇంటి నుంచి బయటకు రావాలంటే భయంగా ఉంది.

- జయలక్ష్మి, మారుతి నగర్

తాగునీటి వసతి లేదు



మా కాలనీలో తాగునీటి పైపు లైన్ లేదు. దూర ప్రాంతం నుంచి మంచినీటిని తెచ్చుకుంటున్నాం. రెండు మూడు బిందెలు తెచ్చుకునే లోపే కుళాయిలకు నీళ్లు బంద్ అవుతున్నాయి. దీంతో తాగు నీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. తాగునీటి వసతి కల్పించాలి.

- మాలంబి, మారుతి నగర్

వీధి దీపాలు ఏర్పాటు చేయలేదు



విద్యుత్ సౌకర్యం లేదని పలుమార్లు కమిషనర్‌కు మొర పెట్టుకున్నాం. చివరకు విద్యుత్ స్తంభాలు వేశారు. మూడు నెలలు అవుతున్నా వీధి దీపాలు ఏర్పాటు చేయలేదు. రోడ్లు, డ్రైనేజీలు, మంచినీటి ఒళాయిలు, వీధి దీపాలు ఇబ్బందులు పడుతున్నాం.

నాగస్వామి, హాజీ నగర్

మంత్రి ఫరూక్‌కు పరామర్శ



మంత్రి ఫరూక్‌ను పరామర్శిస్తున్న శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా

నంద్యాల మున్సిపాలిటీ, మార్చి 23: న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను రాష్ట్ర శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు పరామర్శించారు. స్పీకర్ ఆదివారం హైదరాబాద్‌లోని ఫరూక్ నివాసానికి వెళ్లి వ్యక్తం చేశారు. మంత్రిని పరామర్శించిన వారిలో రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, మాజీ ఎమ్మెల్సీ రామారావు, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డప్పగారి శ్రీనివాస రెడ్డి, కడప ఎమ్మెల్యే రెడ్డప్ప గారి మాధవి రెడ్డి, 'కుడా' చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, టీటీడీ పాలకమండలి సభ్యుడు మల్లెల రాజశేఖర్, టీడీపీ నాయకుడు గౌరు వెంకట రెడ్డి, ఆర్జీఎం విద్యా సంస్థల చైర్మన్ శాంతి రాముడు తదితరులు ఉన్నారు.

ఆత్మకూరు: రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ సతీమణి షహనాజ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందడంతో ఆదివారం ఆయను ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి పరామర్శిం చారు. హైదరాబాద్‌లోని మంత్రి ఫరూక్ స్వగృహానికి వెళ్లి ఆయనను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు.

'బీజేపీని బలోపేతం చేయాలి'



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నాయకులు

నంద్యాల కల్చరల్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): సంస్థాగత ఎన్నికలకు బీజేపీ బలోపేతం చేయాలని బీజేపీ రాష్ట్ర సంఘటనా కార్యదర్శి మధుకర్ అన్నారు. నంద్యాలలో ఆదివారం జిల్లా స్థాయి సంస్థాగత సమావేశం నంద్యాలలోని నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వల చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మధుకర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల గురించి నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు మాట్లాడుతూ జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. విజయవాడ ఇన్‌చార్జి అడ్వకేట్ నరసింగరావు, నంద్యాల జిల్లా ఇన్‌చార్జి పోతుగంటి రమేష్ నాయుడు, వెంకట శివనారాయణ, మోమిన్ షబానా, కొశెట్టి కృష్ణమూర్తి, మేడా మురళీధర్, మండలాల అధ్యక్షులు, సభ్యులు, క్రియాశీల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్ఎల్ఎన్ఏ పరీక్ష పరిశీలన



పరీక్షను పరిశీలిస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్

ఆత్మకూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా జాతీయ సార్వత్రిక విద్యా సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న వయోజనులకు ఆదివారం ఎల్ఎఫ్ఎన్ఏ పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటాపురంలోని ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన ఈ పరీక్షను వయోజన విద్య జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నంద్యాల జిల్లాలోని 28 మండలాల్లో మొదటి విడతగా స్వయం సహాయ సంఘాల్లోని 26,785 మంది నిరక్ష్యరాస్యులను గుర్తించి 2677 కేంద్రాల ద్వారా ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా 15 అంతకంటే ఎక్కువ సంవత్సరాలు కలిగిన చదువు రాని వయోజనులకు అక్షరాస్యత కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణ సాధించిన వారికి జాతీయ సార్వత్రిక విద్యా సంస్థ ద్వారా ధృవీకరణ పత్రాలను మంజూరు చేయనున్నట్లు చెప్పారు. పాఠశాల ఉపాధ్యాయులు జయమ్మ, శోభ, నాగమణి ఉన్నారు.

కంచె ఏర్పాటుపై వివాదం



ఇరువర్గాలతో మాట్లాడుతున్న సీఐ సుబ్రహ్మణ్యం

మిడుతూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాసపేట మజరా గ్రామమైన ఉప్పలదడియ సరిహద్దులో వెలసిన కల్వరి టెంపుల్ సమీపంలో రైతులకు, కల్వరి టెంపులు వారికి ఘర్షణ జరిగింది. ఆదివారం కల్వరి టెంపులు చుట్టూ కొందరు వ్యక్తులు కంచెను ఏర్పాటు చేస్తుండగా పొలాలకు వెళ్లే రస్తాలో ఏర్పాటు చేస్తున్నారని అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగి ఘర్షణ వాతావరణం నెలకొంది. నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం తన సిబ్బందితో ఘటనా స్థలాకి చేరుకుని ఇరు వర్గాలతో మాట్లాడారు. ఈ విషయంపై రెవెన్యూ అధికారులతో మాట్లాడతామని, ఎవరూ ఘర్షణ పడొద్దని సీఐ సూచించారు. ఎస్ఐలు ఓబులేసు, తిరుపాలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయానికి గ్రీన్ మ్యాట్స్ అందజేత

మహానంది, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మహానందిలో వేసవిలో భక్తులు ఇబ్బందులు పడకుండా నంద్యాల రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఎన్‌సీ మోహన్‌రెడ్డి, సెక్రటరీ బాలకృష్ణ గ్రీన్‌మ్యాట్స్ అందజేశారు. ఆదివారం మహానంది ప్రధాన ఆలయం పరిసరాలతో పాటు రెండో ప్రాకారంలో ఆలయాన్ని దర్శించే భక్తుల పాదాల రక్షణ కోసం గ్రీన్ మ్యాట్లను ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి సమక్షంలో ఆలయ సీనియర్ అసిస్టెంట్ నీలకంఠరాజుకు అందజేశారు. అలాగే నంద్యాలకు చెందిన అవ్వారు గౌరినాథ్, అరవింద ప్రసాద్ గ్రీన్ మ్యాట్లను అందచేసినట్లు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ పసుపుల సుబ్బారెడ్డి తెలిపారు.

మహానందీశ్వరుడికి పూజలు

మహానంది, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో ఆదివారం కర్ణాటక భక్తుల కోలాహలంతో నిండిపోయింది. శనివారం రాత్రి వివిధ వాహనాల ద్వారా కొంతమంది రాగా మరికొందరు భక్తులు కాలినడకను పాదయాత్ర చేస్తూ క్షేత్రానికి వచ్చారు. ఉదయం ఆలయ పరిసరాల్లోని కోనేర్లల్లో స్నానాలు ఆచరించారు. కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరుడిని దర్శించుకున్నారు.

గోదాదేవికి కుంకుమార్చన

ఆత్మకూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలో వెలసిన భూవరాహి సహిత, పద్మావతి గోదా సమేత శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయ 25వ వార్షిక వేడుకల్లో భాగంగా మూడో రోజైన ఆదివారం గోదాదేవీ అమ్మవారికి సామూహిక కుంకుమార్చన క్రతువును శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ఉదయం ఆలయంలో సుప్రభాతసేవా, ఆరాధన, నివేధన, గోష్ఠి, చతుఃస్థానార్చన, హోమాలు, శాత్తుమొర్రై, తీర్థ ప్రసాద గోష్టి వంటి క్రతువులను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే ఉదయం 11గంటల సమయంలో గోదాదేవీ అమ్మవారికి విశేష అలంకరణ గావించారు. సాయంత్రం 7గంటల సమయంలో మహిళలు సామూహిక కుంకుమార్చన కార్యక్రమాలను చేపట్టారు. చివరగా పూర్ణాహుతి, బలిప్రదానం, వాహనోత్సవం, ఆలయ ప్రవేశం, శాత్తుమొర్రై, తీర్థప్రసాద గోష్ఠి, శయ్యాసనము వంటి కార్యకర్తలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీశైలం మాజీ ట్రస్టుబోర్డు చైర్మన్ వంగాల శివరామిరెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షులు రామయ్య, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

30న ఎద్దుల బండలాగుడు పోటీలు

పగిడ్యాల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఉగాది సందర్భంగా లక్ష్మాపురం గ్రామంలో ఈ నెల 30న అంతర్ రాష్ట్ర స్థాయి ఎద్దుల బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మొదటి ఐదు బహుమతులు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.12 వేలు అందజేయనున్నట్లు తెలిపారు. ప్రవేశ రుసుం రూ.500 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే 31న పాల పండ్ల సైజ్ ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 7702627036, 9701631367 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

'ఆరోగ్యంపై దృష్టి సారించాలి'

ఆత్మకూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యంపై ప్రజలు దృష్టి సారించాలని ఆత్మకూరు మేజర్ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ కంచర్ల గోవిందరెడ్డి సూచించారు. ఆదివారం ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో కర్నూలులోని శ్రీచక్ర ఆసుపత్రి సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఆసుపత్రి చైర్మన్ విజయకుమార్‌రెడ్డి, టీడీపీ మండలాధ్యక్షులు శివప్రసాద్‌రెడ్డి, నాయకులు వెన్నా శ్రీధర్‌రెడ్డి, మోమిన్ మునీర్‌బాషా, ముస్తఫా, నాగూర్‌ఖాన్, హుషః, షాహీద్‌ఖాన్, అసాదుల్లా తదితరులు ఉన్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

ఆత్మకూరు రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మండలంలోని కరివేన గ్రామ శివార్లలోని ఆర్డీవో కార్యాలయం వద్ద ఆదివారం రెడ్‌క్రాస్ సొసైటి ఆధ్వర్యంలో కన్నడ భక్తుల కోసం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్లు గోవిందరెడ్డి, దస్తగిరి రెడ్డి, మాజీ చైర్మన్ శ్రీనివాస యాదవ్‌ల ఆధ్వర్యంలో ఆత్మకూరు ఆర్ఎంపీ అసోసియేషన్ సభ్యుల సహకారంతో ఈ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాలినడకన శ్రీశైలానికి వెళుతున్న పాదయాత్రికులకు వైద్య సేవలు అందించి ఉచితంగా మందులను, ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆత్మకూరు అసోషియేషన్ గౌరవ అధ్యక్షుడు సలామ్, అధ్యక్ష ఉపాధ్యక్షులు చింతలయ్య, వెంకటేశ్వర్లు, సభ్యులు రాము, హిదాయతుల్లా, మక్బుల్ బాషా, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపురంలో అన్నదానం

ఆత్మకూరు రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహాక్షేత్రంలో ఉగాది మహోత్సవాలను పురస్కరించుకుని పాదయాత్రగా తరలివెళ్లే కన్నడికులకు దాతలు అన్నదాన శిబిరాలు ఏర్పాటు చేసి వారి సేవలో తరిస్తున్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలానికి పాదయాత్రగా తరలి వెళ్లే కన్నడపాద యాత్రికుల కోసం వెంకటాపురం గ్రామంలోని మల్లేశ్వర స్వామి దేవస్థానం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వెంకటాపురం గ్రామంలో అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేసి భక్తుల సేవలో తరిస్తున్నారు. గత 27 సంవత్సరాల నుంచి ఇక్కడ అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

మజ్జిగ పంపిణీ

పాములపాడు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పాములపాడులో టీడీపీ నాయకులు ఆళ్ళగడ్డ హరిసర్వోత్తమరావు ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్తున్న కన్నడిగులకు మజ్జిగ పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు మల్లికార్జున, నబిరసూల్ మన్నెం పుల్లయ్య రాజు, లింగస్వామి, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

26న ధర్నాకు తరలి రావాలి: సీపీఎం

నందికొట్కూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సమస్యల పరిష్కారం కోసం ఈనెల 26వ తేదీన ఉదయం 10 గంటలకు నందికొట్కూరు మున్సిపాల్టీ కార్యాలయం ముందు చేపట్టే ధర్నాకు ప్రజలు తరలి రావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నాగేశ్వరరావు కోరారు. ఆదివారం నందికొట్కూరు సీపీఎం పార్టీ కార్యాలయంలో సీపీఎం నాయకులు గోపాలకృష్ణ, ఉస్మాన్‌బాషా, మధుబాబు నాయుడు, గోకారి, అబ్దుల్ రషీద్‌లతో కలిసి కరపత్రం విడుదల చేశారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ నాగేశ్వరరావు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం నేడు కూటమి ప్రభుత్వం ప్రజలపైన పన్నులు వేయడం తప్ప అభివృద్ధిపైన దృష్టి సారించడం లేదన్నారు. మున్సిపాల్టీలోని స్థానిక సమస్యలతో పాటు రేషన్ కార్డులు, వితంతు, వృద్ధాప్య, దివ్యాంగుల పింఛన్లు, ఇళ్ల స్థలలాల కోసం పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఆర్థిక సాయం అందజేత

పగిడ్యాల, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మాపురం గ్రామానికి చెందిన రంగస్వామి(30) అనే వ్యక్తి ఆదివారం మృతి చెందారు. దీంతో టీడీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ గోవిందు, మద్దిలేటి గౌడు మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేలు అందజేశారు.

ప్రాతకోటలో కార్డన్ సెర్చ్

పగిడ్యాల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ప్రాతకోట గ్రామంలో ఆదివారం నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలోని అనుమానితులు, రౌడీషీటర్ల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. సీఐమాట్లాడుతూ గ్రామంలో ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ముచ్చుమర్రి, మిడుతూరు ఎస్ఐలు శరత్‌కుమార్‌రెడ్డి, ఓబులేసు సిబ్బంది ఉన్నారు.

పనుల పరిశీలన

నంద్యాల మున్సిపాలిటీ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బస్టాండు రహదారిలో పట్టణం నుంచి ఎస్సార్బీసీ, నందమూరి నగర్, వైఎస్ నగర్‌తో పాటు పలు గ్రామాలకు వెళ్లే ఎస్సార్బీసీ ఆర్చి వద్ద డ్రైనేజీ కల్వర్టు పనులు జరుగుతున్నాయి. నందమూరి నగర్ పరిసరాలోని వేలాది మంది ప్రజలకు నీటిని సరఫరా చేసే ప్రధాన పైపులైన్ ఆటంకంగా మారడంతో ఆదివారం పనులను వాటర్ వర్క్స్ డీఈఈ నాగభూషణ్ రెడ్డి పరిశీలించారు. పైపులైన్‌ను డ్రైన్ కంటే లోతుగా తవ్వించారు. తాగు నీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా పైప్‌లైనును సుమారు ఆరు అడుగల లోతులో అమర్చారు.

వెలుగోడు ఎస్ఐ బదిలీ



విష్ణునారాయణ

వెలుగోడు మార్చి 23(ఆంధ్రజ్యోతి): వెలుగోడు ఎస్ఐ విష్ణునారాయణను జిల్లా ఉన్నతాధికారులు చిత్తూరు జిల్లాకు బదిలీ చేశారు. గత ఏడాది ఆగస్టు 16న వెలుగోడు ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు. అయితే పలు కారణాల వల్ల ఆయనను బదిలీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

పాములపాడు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంబాలపల్లి గ్రామం వద్ద కర్నూలు, గుంటూరు ప్రధాన రహదారిలో ఆదివారం జీపు, ట్రాలీ ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ ఖాశీంవలికి తీవ్ర గాయాలయ్యాయి. శ్రీశైలం నుంచి కర్ణాటకకు వెళ్తున్న జీపు, కర్నూలు నుంచి ఆత్మకూరు వెళ్తున్న ట్రాలీ ఆటో ఢీకొన్నాయి. తీవ్రంగా గాయపడిన ఆటో డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించారు.

16, 17 తేదీల్లో షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

సున్నిపెంట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): సున్నిపెంటలో ఏప్రిల్ 16, 17 తేదీలలో షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నారు. మొదటి మూడు బహుమతులు వరుసగా రూ.15 వేలు, రూ.10వేలు, రూ.5 వేలు ఇవ్వనునట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఈ పోటీలలో పాల్గొనడానికి వయో పరిమితి లేదని, లింగాగట్టు, సున్నిపెంట, ఈగలపెంట, దోమలపెంట క్రీడాకారులు పాల్గొన వచ్చని నిర్వాహకులు తెలిపారు. పూర్తి వివరాలకు 9676680216, 9281072665 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

అమరవీరులకు ఘన నివాళి



పాణ్యంలో నివాళి అర్పిస్తున్న విద్యార్థులు

నంద్యాల కల్చరల్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో పట్టణంలోని పింగళిసూరన శాఖ గ్రంథాలయంలో భగత్‌సింగ్ 94వ వర్ధంతి సదర్భంగా అమరవీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సభ్యులు, కవులు, ఉపాధ్యాయులు భగత్‌సింగ్ చిత్రపటానికిపూలమాల వేసి నివాళులు అర్పించారు. రాజ్‌గురు, సుఖదేవ్ త్యాగాలను గుర్తిచేసుకున్నారు. దివంగత దేవులపల్లి చెంచుసుబ్బయ్య రచించిన సాహిత్య పుస్తకాలను వారి కుటుంబ సభ్యులు పాఠకులకు అందజేశారు. సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసమూర్తి, రోటరీ విద్యాసంస్థల అధినేత డీవీ సుబ్బయ్య, రచయితలు డా.వెంకటేశ్వర్లు, ప్రసాద్, కవులు అన్నెం శ్రీనివాసరెడ్డి, నరేంద్ర, కళామురళి, రామచంద్రమూర్తి, శివరామిరెడ్డి, పుల్లయ్య, గ్రంథాలయాధికారి రాధాబాయి తదితరలు పాల్గొన్నారు.

నంద్యాల రూరల్: నంద్యాలలోని సీపీఎం కార్యాలయంలో భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్, కార్యదర్శి వర్గ సభ్యుడు నాగరాజు, పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, మహమ్మద్‌గౌస్, బాలవెంకట్, డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి శివ, పాల్గొన్నారు.

● పట్టణంలోని పీడీఎస్‌యూ నాయకులు కార్యాలయంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు రఫీ, జిల్లా ఉపాధ్యక్షుడు షాహిన్, పట్టణ నాయకులు సుభాన్, హరి, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

● పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో భగత్‌సింగ్ వర్ధంతిని నిర్వహించారు. పార్టీ జిల్లా సహాయకార్యదర్శి బాబాపక్రుద్దీన్, పట్టణ కార్యదర్శి ప్రసాద్, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి శ్రీనవాసులు తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు: నందికొట్కూరు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి హరివర్ధన్, నాయకులు శేషాద్రి నాయుడు, అబ్దుల్లా ఖాన్, వంశీ, రాము, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ వర్ధంతిని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు రణధీర్, ఎస్ఎఫ్ఐ నాయకులు దినేష్‌కుమార్, సాయి పాల్గొన్నారు.

● పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. నాయకులు ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

బండిఆత్మకూరు: మండలంలోని ఎ.కోడూరులో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు సుబ్బరాయుడు, కార్యదర్శి డేవిడ్, కుళాయిస్వామి, చంద్రబాబు, శిఖామణి పాల్గొన్నారు.

సున్నిపెంట: సున్నిపెంలో భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఆశీర్వాదం, వై.శీను, మల్లికార్జున, ఏఐవైఎఫ్ నాయకులు మహేష్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పాణ్యం: సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. మోడల్ పాఠశాల, హాస్టల్‌లో విద్యార్థులు ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమాల్లో ప్రజా సంఘాల నాయకులు భాస్కర్, రాజా, నాగరాజు, ప్రతాప్, ఆటో, హమాలి యూనియన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



ఎస్‌బీఐ కాలనీలో రక్షణ గోడ లేని ట్రాన్స్‌ఫార్మర్

నంద్యాల క్రైం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): నంద్యాల ఎస్‌బీఐ కాలనీలో ప్రధాన రహదారి పక్కన ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. అపార్టుమెంట్ల సమీపంలో ఏర్పాటు చేసిన ఈ ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణ గోడకాని, ఎలాంటి కంచె లేకపోవడంతో ప్రమాదకరంగా తయారైంది. ద్విచక్ర, ఇతర వాహనదారులు, స్థానికులకు ఈ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. చిన్నారులు ఆడుకునే సమయంలో ట్రాన్స్‌ఫార్మర్‌తో ప్రమాదం పొంచి ఉందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రక్షణ గోడ నిర్మించాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. ప్రస్తుతం వేసవికాలం కావడంతో పిల్లలకు ఒంటిపూట బడులు ఉండడంతో ట్రాన్స్‌ఫార్మర్ రోడ్డుపై పిల్లలు క్రికెట్‌తో పాటు వివిధ అవుట్‌డోర్ గేమ్స్‌ను ఆడుకుంటూ ఉంటారు. ఈ క్రమంలో ఏదైన ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన విద్యుత్‌శాఖాధికారులు చర్యలు చేపట్టి ఆ ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణగోడ, కంచె ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

వైభవంగా కలశ స్థాపన మహోత్సవం



హోమంలో పాల్గొన్న మహిళలు

చాగలమర్రి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని శివరామానంద ఆశ్రమంలో ఆదివారం 55వ శంకరానంద స్వామి ఆరాధన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అభినవ శంకరానందస్వామి ఆధ్వర్యంలో కలశ స్థాపన, హోమాలు వైభవంగా నిర్వహించారు. స్వప్రకాశనందసరస్వతి గీతాపారాయణం, దీపారాధన కార్యక్రమాలు చేశారు. మహిళలు సామూహికంగా ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. ఆళ్లగడ్డకు చెందిన యోగేశ్వరానందగిరి స్వామి ఆధ్యాత్మిక ఉపన్యాసం చేశారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల ఆశ్రమ పీఠాధిపతులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దైవ మార్గంలో నడవాలి



వాసాపురంలో మాట్లాడుతున్న రాధామనోహర్ దాస్

రుద్రవరం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : దైవమార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని హిందూ ధర్మ సంరక్షకులు రాధామనోహర్‌దాస్ అన్నారు. ఆదివారం రుద్రవరం మండలం వాసాపురంలో హిందూ మత ప్రచారాన్ని చేశారు. అంతకుముందు వాసాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో , మానస లింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రవచనాలు చెప్పారు. ప్రతి ఒక్కరూ హిందూ మతాన్ని బలోపేతం చేయాలన్నారు. దైవమార్గంలో నడిచి పుణ్యఫలాలు పొందాలన్నారు. ఆలయ నిర్వాహకులు ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ మధుసూదన్‌రెడ్డి, వైస్‌ఛైర్మన్ రంగనాయకులు, కార్యదర్శి నరసింహులు, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి

చాగలమర్రి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు యేసురత్నం, కార్యదర్శి రామాంజనేయులు కోరారు. ఆదివారం చాగలమర్రి సంతమార్కెట్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ కార్మికులకు పంచాయతీ నిధులతో సంబంధం లేకుండా వేతనాలు ఇవ్వాలన్నారు. ప్రమాద బీమా, పీఎఫ్, ఈఎస్ఐ, గుర్తింపు కార్డు ఇవ్వాలన్నారు. ప్రతి నెల 5లోగా జీతాలు చెల్లించాలని, అంత్యక్రియలకు రూ.15 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ యూనియన్ నాయకులు రాజు, బాబు, యేసన్న, బుజ్జి, పవన్, సునీత, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహించొద్దు: సీఐ



వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్న సీఐ రమేష్‌బాబు

కొలిమిగుండ్ల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): డ్రైవింగ్ చేసే సమయంలో చేసే చిన్నపాటి నిర్లక్ష్యం కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తుందన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని సీఐ రమేష్‌బాబు అన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో ఆటో డ్రైవర్లు, వాహన చోదకులు, హమాలీలకు నూతన రవాణా శాఖ చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలన్నారు. అధిక లోడుతో వాహనాలు నడపరాదని సూచించారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని, ప్రయాణికులు సైతం ప్రమాదకర స్థితిలో ప్రయాణం చేయరాదని సీఐ సూచించారు.

'కఠినంగా శిక్షించాలి'

అవుకు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : తూర్పుగోదావరి జిల్లా దూబచర్ల పట్టణంలోని గాంధీ కాలనీలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని అవమానించిన వ్యక్తులను గుర్తించి కఠినంగా శిక్షించాలని జైభీమ్ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల దేవరత్నం ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం పట్టణంలో మాల మహానాడు రాష్ట్ర కన్వీనర్ ఆవుల సుధాకర్‌బాబుతో కలసి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దేవరత్నం మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జైభీమ్ మాలమహానా డు నాయకులు జయచంద్ర, ఆనంద్, చిన్న అంకన్న, మురళి పాల్గొన్నారు.

ఆకతాయిపై కేసు నమోదు

బనగానపల్లె, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నందివర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని చౌడేశ్వరీదేవి ఆలయ సమీపంలో మహిళల వీడియోను చిత్రీకరించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటసుబ్బయ్య ఆదివారం తెలిపారు. నందవరం గ్రామానికి చెందిన ఆకతాయి కొప్పెర సంతోష్ వీడియో తీస్తుండగా భక్తురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అపార నష్టం

- అకాలంగా వడగండ్ల వాన
- వందలాది ఎకరాల్లో నేలరాలిన మామిడి, మిర్చి
- తడిసిన మొక్కజొన్న ధాన్యం
- ఆవేదనలో రైతులు



రేవనూరులో నేలరాలిన మిరప



ఏనుగమర్రిలో నేలరాలిన మామిడి కాయలు



ప్యాపిలిలో రాలిన కాయలను చూపిస్తున్న రైతు వెంకటరాముడు



ఉయ్యాలవాడలో పట్టలను తొలగిస్తున్న రైతులు

ప్యాపిలి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షంతో అన్నదాతకు అపార నష్టం వాటిల్లింది. మండలంలో శనివారం అర్ధరాత్రి కురిసిన వడగండ్ల వాన బీభత్సం సృష్టించింది. వందలాది ఎకరాల్లో మామిడి కాయలు నేలరాలాయి. రూ.లక్షల్లో నష్ట వాటిల్లింది. దీంతో మామిడి రైతులు గగ్గోలు పెడుతున్నారు. మండలంలోని ప్యాపిలి, ఏనుగమర్రి, మెట్టుపల్లి, కలచట్ల, ఎర్రగుంట్లపల్లి, వెంగళాంపల్లి, పోతుదొడ్డి, మాందొడ్డి తదితర గ్రామాల్లో వడగండ్ల వాన కురిసింది. ఈ వర్షంతో పాటు పెనుగాలులు కూడ బీభత్సం చేశాయి. దీంతో ఆ గ్రామాల్లో మామిడి తోటలు దెబ్బతిన్నాయి. చేతి కొచ్చిన మామిడి కాయలు నేలరాలాయి. ఒక్కో రైతుకు రూ.లక్షల్లో నష్టం వాటిల్లింది. అప్పులు చేసి పంటను ఏడాదిగా కాపాడుకుంటూ వచ్చామని, అకాల వర్షం తమను నట్టేట ముంచిందని ప్యాపిలి, కలచట్ల, ఏనుగమర్రి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వమే ఆదోకోవాలని కోరుతున్నారు.

ఉయ్యాలవాడ: మండలంలో కురిసిన అకాల వర్షాలు పంటలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. శనివారం రాత్రి బలమైన గాలులతో కురిసిన వర్షం తీవ్ర నష్టాన్ని కలిగించింది. మండలంలోని రూపనగుడి, ఉయ్యాలవాడ, అల్లూరు, మాయలూరు, తుడుమలదిన్నె, ఇంజేడు తదితర గ్రామాల్లోని రైతులు కళ్లాల్లో ఆరబెట్టిన పండు మిర్చీ తడిచిపోయింది. ఎండు మిర్చీని కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు పడ్డారు. బలమైన గాలులు వీయటంతో పట్టాలు కప్పటం కష్టంగా మారింది. అలాగే కోత దశలో ఉన్న వరి పంట నేలవాలింది. మాయలూరు గ్రామంలో భారీ వృక్షాలు విరిగి నేలవాలాయి. రూపనగుడి, మాయలూరు, తుడుమలదిన్నె గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పండింది.

రుద్రవరం : మండలంలోని నరసాపురం, ముత్తలూరు, నల్లవాగుపల్లె గ్రామాలతో పాటు మరికొన్ని గ్రామాల్లో శనివారం రాత్రి వర్షం కురిసింది. వర్షానికి రహదారులపై ఆరబోసిన మొక్కజొన్న ధాన్యం తడిచిపోయింది. అలాగే వరి పంట నేలవాలింది. చేతికందిన పంట తడిచిపోయిందని ఆదివారం రైతులు వాపోయారు.

కోవెలకుంట్ల : ఆరుగాలం కష్టించి పంటలు పండించిన రైతన్నలకు అతివృష్టి అనావృష్టి వల్ల నష్టం వాటిల్లుతూనే ఉంది. శనివారం సాయంత్రం కురిసిన గాలివాన బీభత్సానికి వందల ఎకరాల్లో మిరప పంట దెబ్బతిన్నది. కలుగొట్ల, రేవనూరు, లింగాల గ్రామాల్లో చేతికందిన పంట ఒక్కసారిగా నేలకూలడంతో ఆందోళన పడుతున్నారు. ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.



రూపనగుడిలో పట్టలపై నిలిచిన నీటిని తోడేస్తున్న రైతులు



రుద్రవరం: తడిసిన మొక్కజొన్నలను రహదారిపై ఆరబోసిన రైతులు

అమరవీరుల అడుగుజాడల్లో నడవాలి



బేతంచెర్లలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న రంగనాయకుడు, ఏఐఎస్‌ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు



ఆళ్లగడ్డలో విద్యార్థులతో కలిసి నివాళి అర్పిస్తున్న అమీర్ బాషా

బేతంచెర్ల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : సమాజంలోని యువత భగత్‌సింగ్ అడుగు జాడల్లో నడవాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు అన్నారు. ఆదివారం పట్టణంలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో బాలుర హాస్టల్‌లో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్‌కన్నా అధ్యక్షతన స్వాతంత్ర్య సమరయోధులు సర్దార్ భగత్‌సింగ్ రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్‌యన్నా, ఏఐఎస్ఎఫ్ ఏఐవైఎఫ్ మండల నాయకులు ఎల్లకృష్ణ, ప్రదీప్, కార్తిక్, రాజు, సూర్య పాల్గొన్నారు.

డోన్ టౌన్: స్వాతంత్ర్య సమరయోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు సుఖ్‌దేవ్ అడుగుజాడల్లో నడుద్దామని యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు వెంకటసుబ్బారెడ్డి అన్నారు. ఆదివారం పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు సుబ్బరాయుడు, జిల్లా పూర్వ గౌరవాధ్యక్షుడు బాబు, జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యం శెట్టి, భాస్కర్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, సుభాన్, రవిశేఖర్, సంజీవరాయుడు పాల్గొన్నారు. అలాగే పట్టణంలో సీపీఐ, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్, సుఖ్‌దేవ్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నారాయణ, పుల్లయ్య, పృధ్వీ కుమార్, శశిధర్ రెడ్డి, విజయ్, రజాక్, కొండపల్లి నాగరాజు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ(శిరివెళ్ల): దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని ఆళ్లగడ్డ నియోజకవర్గ ప్రైవేట్ పాఠశాలల సంఘం అధ్యక్షుడు అమీర్ బాషా అన్నారు. అమరవీరుల బలిదానం దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహంలో స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలకు విద్యార్థులతో కలిసి పూలమాలలు వేసి ఆదివారం నివాళి అర్పించారు. అమరవీరుల సాహసం, త్యాగం, దేశభక్తిని విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని వారి ఆశయాల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంక్షేమ అధికారి సురేష్, ఉపాధ్యాయుడు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



డోన్‌లో భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న ధర్మవరం సుబ్బారెడ్డి

డోన్ రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పట్టణం సమీపంలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో 41 రోజుల ప్రత్యేక పూజలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ ఛైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డోన్‌కే తలమానికంగా షిరిడీ సాయిబాబా ఆలయం నిలుస్తుందన్నారు. ఆలయ అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో టీడీపీ యువ నాయకులు మన్నె గౌతమ్ రెడ్డి, షిరిడీ సాయిబాబా ఆలయ కమిటి సభ్యులు సీఎం శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి: సీఐ

బేతంచెర్ల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో సత్ప్రవర్తనతో మెలగాలని బేతంచెర్ల సీఐ వెంకటేశ్వరరావు సూచించారు. ఆదివారం బేతంచెర్ల పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో మండలంలోని రౌడీ షీటర్లకు సీఐ కౌన్సెలింగ్ ఇచ్చారు. సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజా జీవనానికి, ప్రజాశాంతికి భంగం కలిగించకుండా ఉండాలన్నారు. అలర్లు, ఘర్షణలు సృష్టిస్తే శాఖాపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ రమేష్ బాబు, పోలీసు సిబ్బంది, రౌడీషీటర్లు ఉన్నారు.

పోలీసు యాక్టును ఎత్తివేయాలి: సీపీఎం

డోన్ రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పోలీస్ యాక్టును ఎత్తివేయాలని సీపీఎం పట్టణ, మండల కార్యదర్శులు నక్కి శ్రీకాంత్, కోయలకొండ నాగరాజు డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పోలీస్ యాక్టు ద్వారా ప్రభుత్వం ఉద్యమాలను అణిచివేయాలని చూస్తుందని ధ్వజమెత్తారు. భవిష్యత్తులో ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో సీపీఎం అనుబంధ సంఘాల నాయకులు నాగమద్దయ్య, శివరాం, కొండయ్య, చిన్న రెహిమాన్ పాల్గొన్నారు.

నవల రచన పోటీల్లో ప్రతిభ

డోన్ టౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఉషా పత్రిక నిర్వహించిన వెలగపూడి సీతారామయ్య స్మారక నవల రచన పోటీల్లో డోన్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ తోగట సురేష్‌బాబు ప్రతిభ కనబరిచారు. ఆదివారం విజయవాడలో ఉషా పత్రిక యాజమాన్యం 'నీలికన్నుల నీడలోనే' అనే నవలకు నగదు ప్రోత్సాహక బహుమతిని మేనేజింగ్ డైరెక్టర్, ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ కోటేశ్వరరావు అందజేశారు.

ఇఫ్తార్‌కు ఆహ్వానం



మతపెద్దలకు దుస్తులను అందజేస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : రంజాన్ పండుగను పురస్కరించుకొని ఈనెల 26న పట్టణంలో ముస్లింలకు ఇఫ్తార్ ఇస్తున్నట్లు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని మసీదుల్లో మత గురువులకు దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం ఇఫ్తార్‌కు హాజరుకావాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో మంత్రి వెంట పలువురు ముస్లిం నాయకులు ఉన్నారు.

చెక్కులు అందజేత

అనారోగ్యంతో బాధపడుతున్న 36మంది బాధితులకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరు అయిన రూ. 34 లక్షల విలువైన చెక్కులను మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాధితుల ఆరోగ్యం గురించి ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. చెక్కులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బాధితులు సీఎం చంద్రబాబుకు, మంత్రి బీసీకి కృతజ్ఞతలు తెలిపారు.

ఆధ్యాత్మిక అంశాలపై పోటీ పరీక్షలు

చాగలమర్రి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని వాసవీ డిగ్రీ కళాశాలలో ఆదివారం ఆళ్లగడ్డ నియోజకవర్గ స్థాయిలో ఉగాది, శ్రీరామనవమి పండుగలను పురస్కరించుకొని ఆధ్యాత్మిక, పౌరాణిక అంశాలపై పోటీ పరీక్షలు నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన విద్యార్థులు, యువతీ యువకులు పాల్గొన్నారు. పోటీల్లో విజేతలైన మొదటి నలుగురికి నగదు బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు పోలిశెట్టి తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్యాబుద్దిన్, విశ్రాంత ప్రిన్సిపాల్ రామకృష్ణ భగవాన్ పాల్గొన్నారు.

ఏపీవో, టీఏలు బదిలీ

చాగలమర్రి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపాధిహామీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఏపీవో నిర్మల కొలిమిగుండ్లకు బదిలీ అయ్యారు. నంద్యాలలో విధులు నిర్వహిస్తున్న ఖాసీం చాగలమర్రి ఏపీవోగా వచ్చారు. టెక్నికల్ అసిస్టెంట్ నరసింహారెడ్డి, మద్దిలేటి రుద్రవరానికి, ఓబులేసు ఆళ్లగడ్డకు, వెంకటన్న బనగానపల్లె, రవి ఉయ్యాలవాడ, కంప్యూటర్ ఆపరేటర్లు ప్రసాద్ ఉయ్యాలవాడకు, మనోహర్‌రెడ్డి ఆళ్లగడ్డకు బదిలీ అయ్యారు. జాయింట్ కలెక్టర్, ఉపాధి పీడీ ఆధ్వర్యంలో బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించి ఆయా ప్రాంతాలకు బదిలీ చేశారు.

కోవెలకుంట్ల : కోవెలకుంట్ల ఏపీవో శ్రీవిద్యను ప్యాపిలికి బదిలీ చేశారు. ఈసీ హరికిశోర్‌ను, సంజామలకు, టెక్నికల్ అసిస్టెంట్లు జయ భారత్‌రెడ్డిని దొర్నిపాడుకు, ఫక్రుద్దీన్‌బాషాను నంద్యాలకు, కొండారెడ్డిని ప్యాపిలికి బదిలీ చేశారు. అలాగే ఏపీవో శ్రీకళ(నంద్యాల), ఈసీ ఓబులేసు (రుద్రవరం), టెక్నికల్ అసిస్టెంట్లు రమణమ్మ, నరసింహుడు, చాంద్ బాషా(కొలిమిగుండ్ల)లను కోవెలకుంట్లకు బదిలీ చేశారు.

కొలిమిగుండ్ల : ఉపాధిహామీ ఏపీవోగా నిర్మలమ్మ నియమితులైయ్యారు. కొలిమిగుండ్ల ఈసీ రాజాబాబును బనగానపల్లెకు బదిలీ చేసిన అధికారులు ఆయన స్థానంలో రంగయ్యను నియమించారు. మరో ముగ్గురు టీఏలను సైతం కొలిమిగుండ్ల నుంచి వేర్వేరు ప్రాంతాలకు బదిలీ చేశారు.

గ్రంథాలయానికి విద్యుత్ సౌకర్యం

కొలిమిగుండ్ల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని గ్రంథాలయానికి విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని బెలుం గ్రామానికి చెందిన కీ.శే పోతిరెడ్డి రామసుబ్బారెడ్డి సేవాట్రస్ట్ అధ్యక్షుడు పోతిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి అన్నారు. ఆదివారం రూ.30వేలు విలువచేసే వివిధ రకాల 150 పుస్తకాలను గ్రంథాలయ లైబ్రరీయన్ రాజామనోహర్‌కు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైబ్రరీలో విద్యుత్ సౌకర్యం, చిన్నచిన్న మరమ్మతులను సేవాట్రస్ట్ ఆధ్వర్యంలో చేయిస్తామని వెంకటసుబ్బారెడ్డి హామీ ఇచ్చారు.

గ్రామ దేవతలకు పూజలు

రుద్రవరం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండమాయపల్లె, రుద్రవరం, చిన్నకంబలూరు, యల్లావత్తుల గ్రామాల్లో ఆదివారం గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అమ్మవార్లకు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. మహిళలు అమ్మవార్లకు చీరలు, బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

కాలబైరవుడికి విశేష పూజలు

కొలిమిగుండ్ల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రమైన కొలిమిగుండ్లలో కొండపై వెలసిన కాలబైరవ స్వామికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు పేరం బయ్యపురెడ్డి, నందకిశోర్‌రెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు మహేష్‌శర్మ స్వామి వారికి పాల్గుణ మాసం, కృష్ణ పక్షం ఆదివారం పురస్కరించుకొని విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

చలివేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- మాజీ సర్పంచ్ ఆలా మోహన్ రెడ్డి

డోన్ రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): వేసవి తాపం నుంచి ఉపశమనానికి ఏర్పాటు చేసిన చలివేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఆవులదొడ్డి గ్రామ మాజీ సర్పంచ్, న్యాయవాది ఆలా మోహన్ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఇందిరానగర్‌లో జనసైనికులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మౌలాలి, దస్తగిరి, వీరయ్య, దత్తు, మహేష్, పాపారాయుడు, పెద్దయ్య, ప్రకాష్, మద్దిలేటి, అంజి, దొరపల్లి, సాయి, రఘు, జయచంద్ర పాల్గొన్నారు.

మహిళా అభ్యాసకులకు పరీక్షలు

చాగలమర్రి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని ఆర్సీఎం ఎయిడెడ్ పాఠశాలలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉల్లాస్ పథకం కింద శిక్షణ పొందిన నిరక్షరాస్య మహిళలకు ఆదివారం అభ్యాసన పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎం నాగమ్మ, అంగన్‌వాడీ వర్కర్లు వహిదా, మాబుచాన్, రెహెనా, రహమతుబీ, వీవోఏలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కోవెలకుంట్ల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఈఘటన పట్టణంలోని పేరా బిల్డింగు సమీపంలో ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. సంజామల మండలం కానాల గ్రామానికి చెందిన డానియేల్ (45) అనే వ్యక్తి మోటారు బైకుపై కోవెలకుంట్ల నుంచి ఆళ్లగడ్డకు వెళ్తున్నాడు. తాడిపత్రి నుంచి ఆళ్లగడ్డ వెళ్తున్న లారీ పేరా బిల్డింగు సమీపంలో వెనుక నుంచి మోటారు బైకును ఢీకొనడంతో డానియేల్ కింద పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. గాయపడ్డ వ్యక్తిని కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య రాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

ఉయ్యాలవాడ, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఉయ్యాలవాడ మండలంలోని ఇంజేడు గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ కొండుపల్లె, ఇంజేడు గ్రామాలకు చెందిన వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావటంతో దాడి చేశామన్నారు. పేకాట ఆడు తున్న ఏడుగురిని అదుపులోకి తీసుకొని రూ. 26,150 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

డోన్ టౌన్: పట్టణంలో పేకాట ఆడుతున్న స్థావరాలపై ఆదివారం రాత్రి పోలీసులు దాడులు చేసినట్లు అర్బన్ సీఐ శరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఎనిమిది మందిని అదుపులోకి తీసుకొని రూ.1,02,390లు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రేపు వేంకటేశ్వరస్వామి కల్యాణం

చాగలమర్రి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడురాళ్లపల్లె గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో 25న శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకొని ఉత్సవమూర్తులకు కల్యాణోత్సవాన్ని నిర్వహించ నున్న ట్లు నిర్వాహకులు ఆదివారం తెలిపారు. ఉభయదారులు శ్రీనివాసులు, విజయలక్ష్మి దంపతులు వ్యవహరిస్తారన్నారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఉపాధ్యాయుడికి సత్కారం

బనగానపల్లె, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో శతాధిక కవితలు రాసిన పూజారి శ్రీనివాసులును యూటీఎఫ్‌మండల అధ్యక్షుడు ప్రతాప్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆదివారం సత్కరించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు సత్యప్రకాశ్ మాట్లాడుతూ మధురిమ అనే నూతన సాహిత్య ప్రక్రియలో పూజారి శ్రీనివాసులు శతాధిక కవితలు రాసినందుకు మేఘనా సాహితీ కళా వేదిక వారు ప్రశంసాపత్రాన్ని అందించారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆడిట్ సభ్యుడు దస్తగిరి , నాయకులు నాగరాజు, విజయ కుమార్, కృష్ణయ్య, గోపాల్, రమేశ్, చంద్రశేఖర్, వీరకుమార్ రెడ్డి, మనోహర, మద్దిలేటినాయక్, శంకర్‌నాయక్, లక్ష్మినాయక్ పాల్గొన్నారు.